క్లుప్తంగా

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



ఏడీబీ రోడ్డులోని ఫ్యాక్టరీ వద్ద ప్లకార్డులతో ధర్నా చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులో ఉన్న టైల్స్ ఫ్యాక్టరీ వద్ద తమను విధులలోకి తీసుకోవాలని కార్మికులు చేస్తున్న ఆందోళన గురువారం కొనసాగింది. అల్లూరి జయంతిని పురస్కరించుకుని ఆయన బాటలో ఆందోళన కొనసాగిస్తామని కార్మికులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతి కుమార్, ఐద్వా నాయకురాలు కె.అరుణ, తొలగింపునకు గురైన కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, శివనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా స్టేడియం నిర్మాణం



స్టేడియాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు, సూరిబాబు రాజు

పెద్దాపురం: స్థానిక శతాబ్ది పార్కు సమీపంలో నిర్మితమవుతున్న ఇండోర్ షటిల్ కోర్టు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజుతో కలిసి స్టేడియంను ఆయన పరిశీలించారు. నిర్మాణం సగంలో నిలిపివేయడంతో ఈ భవనాన్ని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట కొత్తెం కోటి, మొయిళ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మికత అవసరం



ఉపవాస ప్రార్థనల్లో మాట్లాడుతున్న సీజీఎం వ్యవస్థాపకుడు శామ్యూల్ సుదీప్

పెద్దాపురం: ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ పరిశుద్ధ ఆధ్యాత్మికతను అలవరచుకోవాలని క్రిస్టియన్ గాస్పెల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అన్నారు. క్రీస్తు శాంతి ప్రార్థన మందిరాల్లో ఏటా నిర్వహించే ఉపవాస ప్రార్థనల్లో భాగంగా మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో గురువారం మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం అధ్యక్షతన విరవ చర్చిలో ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ సుదీప్, కె.జయకుమార్, కె.అభిషేక్ దైవ ప్రసంగం చేశారు.

ఎస్ఎఫ్‌డీ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా లలిత్‌కుమార్



పెద్దాపురం: స్టేట్ స్టూడెంట్ ఫర్ డవలప్‌మెంట్ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన కె.లలిత్‌కుమార్ నియమితులయ్యారు. ఇటీవల రాజమండ్రిలో నిర్వహించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లలిత్‌కుమార్‌ను రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా ఎన్నుకున్నారు. 2022 నుంచి విద్యార్థుల సమస్యల పరిష్కారంపై పోరాడుతూ అందరి మన్ననలు పొందిన లలిత్‌కుమార్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాల మరమ్మతులు వేగవంతం చేయండి

కాకినాడ: పారిశుధ్య సేవల కోసం వినియోగించే డంపర్ బిన్లు, పుష్ కార్టులు, ఇతర వాహనాల మరమ్మత్తులను సత్వరమే పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధికారును ఆదేశించారు. గురువారం ఆయన బొందగుంటలోని వెహికల్ యార్డ్‌ను సందర్శించారు. వాహనాలను శుభ్రం చేసేందుకు ఏర్పాటు చేసిన ర్యాంపును పరిశీలించారు. వాహనాల పనితీరుపై ఆరా తీశారు. కమిషనర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నేపథ్యంలో మెరుగైన పారిశుధ్య సేవలు అందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇందుకోసం పారిశుధ్య సేవలకు వినియోగించే వాహనాలు, ఇతర పరికరాలు పూర్తి కండిషన్‌లో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆ మేరకు అంచనాలను రూపొందించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, ఏఈ వై.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అల్లూరి ఆశయ సాధనకు కృషి చేద్దాం

- ఆర్డీఓ జేఎస్ రామారావు
- నియోజకవర్గ వ్యాప్తంగా విప్లవ వీరునికి నివాళులు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో జేఎస్ రామారావు అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సిబ్బందితో కలిసి అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డీటీ భానుకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అల్లూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, సిబ్బందితో కలిసి అల్లూరికి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ పద్మావతి, మేనేజర్ జ్యోతిరాణి, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజాతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో..

స్థానిక పాత బస్టాండ్ వద్ద అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు తదితరులు స్థానికులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజుతో పాటు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

అలాగే స్థానిక వరహాలయ్యపేట సీతారామరాజు పార్కు వద్ద డీవైఎఫ్ఐ, ఐద్వా, ప్రజా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాసలపు రమేష్ అధ్యక్షతన జరిగిన జయంతి సభలో ఐద్వా కార్యదర్శి కూనిరెడ్డి అరుణ మాట్లాడుతూ అల్లూరిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుత ప్రజా నాట్యమండలి కార్యదర్శి దారపురెడ్డి కృష్ణ అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నెక్కల నరసింహమూర్తి, దాకమూరి ఏడుకొండలు, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: మన్యంవీరుడు, స్వాతంత్ర పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు జంయంతి వేడుకలు గురువారం మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటనారాయణ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను కొనియాడారు. ఆయన పోరాట పటిమ ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అల్లూరి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిఠాపురం: విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు గురువారం పిఠాపురం నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. పిఠాపురం పట్టణం, గ్రామాల్లోని అల్లూరి విగ్రహాలకు బీజేపీ, జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకట సూర్యనారాయణ మాట్లాడుతూ యువతకు స్ఫూర్తి ప్రదాత అల్లూరి సీతారామరాజు అన్నారు. ప్రతిఒక్కరూ ఆయన బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బిళ్లకుర్తి రామేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, తోట ఏడుకొండలు, సూరిశెట్టి జయకృష్ణ, పసుపులేటి సత్యనారాయణ, ఓలేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అల్లూరికి ఘనంగా నివాళి

సామర్లకోట: అల్లూరి సీతారామరాజు జయంతిని మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మున్సిపల్ కార్యాలయం, అల్లూరి సీతారామరాజు పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలరు పాగా సురేష్‌కుమార్, నేతల హరిబాబు, కరణం రాజ్‌కుమార్, పితాని కృష్ణ, మర్రి శేషారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, పాలిక చంటిబాబు, మాదిగ ఐక్యవేదిక జిల్లా నాయకుడు కాళ్ల లక్ష్మీనారాయణ, మున్సిపల్ మేనేజరు అచ్యుతరాజు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే బళ్ల మార్కెట్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి భారతమాత సేవా పరిషత్ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర నివాళులు అర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వై శ్రీనివాసు ఆధ్వర్యంలో అల్లూరికి నివాళులు అర్పించగా వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ హైస్కూల్‌లో..

బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకా నంద వర్ధంతిని హెచ్ఎం తోటకూర సాయిరామ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.



కొత్తపల్లిలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ



సామర్లకోటలో అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

విద్యార్థి సంఘాల ఆందోళన



పిఠాపురంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పిఠాపురం: నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలుకు కేంద్ర బిందువైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎన్‌టీఏ పనితీరు, నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ గురువారం పిఠాపురం, గొల్లప్రోలులో విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనలు చేశారు. విద్యార్థులతో కలిసి శాంతియుతంగా బంద్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ, కేంద్ర విద్యా శాఖ మంత్రికి వ్యతిరేకంగా వినాదాల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు, పిఠాపురం అధ్యక్షులు శ్రీకాంత్, సిద్ధు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించడంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పరీక్షా పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. కాకినాడ జిల్లా గరల్స్ కన్వీనర్ చిన్ని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో పదే పదే ఆడుకుంటుందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, విద్యార్థులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు లోవరాజు, వెంకటేష్, ప్రకాష్, అయ్యప్ప, జానీ, తేజ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలి



వార్డుల్లో పారిశుధ్య సమస్యలను కమిషనర్, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లిన కౌన్సిలర్లు

సామర్లకోట: వార్డులలో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కమిషనర్ జె.రామారావులకు గురువారం వివరించారు. ఇటీవల పారిశుధ్య కార్మికులు పదవీ విరమణ చేయడం, కొందరు చనిపోవడంతో వార్డులో పారిశుధ్య సమస్య ఏర్పడిందని కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్, కరణం రాజ్‌కుమార్, నేతల హరిబాబులు తెలిపారు. ఈ మేరకు అదనపు కార్మికులను నియమించాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఔట్ సోర్సింగ్‌లో కూడా కొత్త కార్మికులను నియమించుకోడానికి అవకాశం లేదని చెప్పారు. ప్రతి వార్డులోను ఇద్దరు చొప్పున మాత్రమే ఉండడం వల్ల డిప్యూటేషన్ వేస్తే వారి వార్డులో సమస్య ఏర్పడుతుందని శానిటరీ ఇన్‌స్పెక్టరు పి. శ్రీనివాసరావు కమిషనర్‌కు వివరించారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆరుగురు ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్నారని, వారిని పారిశుధ్య విభాగానికి తీసుకురావాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ఉబా జాన్ మోజెస్, కౌన్సిలర్లు మర్రి శేషారావు, పార్టీ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, కాళ్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై రైతులు దృష్టి పెట్టాలి

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయ్‌కుమార్



చిరు ధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న జేడీ విజయ్‌కుమార్

పెద్దాపురం: ప్రభుత్వం చిరుధాన్యాల పంటలకు ప్రాధాన్యమిస్తోందని, రైతులు వాటిపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వాలు తిమ్మాపురం గ్రామంలో గురువారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఏడీఏ దైవకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేడీ విజయకుమార్ మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో వాతావరణానికి అనుకూలమైన రాగులు వంటి చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఎకరానికి మూడు కేజీల చొప్పున రాగులు సాగుచేస్తే 120 రోజుల పంట కాలం తరువాత ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. డీడీ ఎ.హరి మాట్లాడుతూ పెద్దాపురం మండలంలో మెట్ట ప్రాంతంలో కర్రపెండలం సాగుకు ప్రత్యామ్నాయంగా చిరు ధాన్యాల పంటను సాగు చేసి లాభాలు పొందవచ్చన్నారు. అనంతరం చిరు ధాన్యాల పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కె.సంజయ్ కుమార్, ఏడీఏ మాధవి, ఏఈఓ ప్రసాద్, వీహెచ్ఏలు చిలకమ్మ, మల్లిక, రైతులు సైనం సాల్మన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత మొక్కలు నాటండి

- హానికారక కోనోకార్పస్ చెట్ల తొలగింపుపై కలెక్టర్ సమీక్ష
- ఫ్లెక్సీలు లేని వీధులపై సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: పట్టణంలో పర్యావరణానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్లను తొలగించి వాటి స్థానంలో ప్రాణ వాయువు విడుదల చేసే మొక్కలు నాటేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆ చెట్ల తొలగింపు, ఫ్లెక్సీలు లేని స్ట్రీట్ వంటి అంశాలపై కలెక్టర్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్, హార్టీకల్చర్, అటవీశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణ పరిధిలో కోనోకార్పస్ చెట్ల తొలగింపు, వాటి స్థానంలో ఆక్సిజన్ విడుదల చేసే మొక్కలు నాటడం, ఫ్లెక్సీలు లేని స్ట్రీట్‌లను తీర్చుదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో చర్చించారు. పట్టణ పరిధిలో సుమారు 4,602 కోనోకార్పస్ చెట్లు గుర్తించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తొలిదశలో పట్టణ పార్కుల్లో ఉన్న చెట్లు తొలగించాలని ఆదేశించారు. జిల్లా అటవీశాఖ అధికారులను సమన్వయం చేసుకుని తొలగించిన చెట్ల స్థానంలో వెంటనే ఆక్సిజన్ విడుదల చేసే మొక్కలు నాటేందుకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే ఏ వీధిలో చూసినా ఫ్లెక్సీలే కనిపిస్తున్నాయని, తొలుత భానుగుడి జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ఉన్న ఫ్లెక్సీలు తొలగించాలని, ముందుగా వాటిని ఏర్పాటు చేసిన వారికి సమాచారం ఇచ్చి సోమవారం వరకు తొలగించేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. ఆ లోగా తొలగించకపోతే మంగళవారం జూలై 9న అధికారులే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కాకినాడ కమిషనర్ జె.వెంకటరావు, టౌన్ ప్లానింగ్ అధికారి కె.హరిదాస్, హార్టికల్చర్ ఏడీ టీవీ శిరిల్, కాకినాడ సోషల్ ఫారెస్ట్ ఎఫ్ఆర్వో బి.పద్మజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కళాశాలలో బీఏ ఆనర్స్ (ఎకనామిక్స్), బీకాం ఆనర్స్ (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ ఆనర్స్ (కెమిస్ట్రీ), బీఎస్సీ ఆనర్స్ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ ఆనర్స్ (జువాలజీ) కోర్సులు అందుబాటులో ఉన్నట్లు ఆమె వివరించారు. ఈ నెల 10వ తేదీతో అడ్మిషన్ల ప్రక్రియ ముగుస్తున్నందున విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు



రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న అర్చకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన రామలింగేశ్వరస్వామికి గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జ్యేష్ఠ బహుళ త్రయోదశి, తత్కాల చతుర్దశి మాస శివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు, స్మార్త ఆగమ పండితులు అల్లంరాజు రామకృష్ణ శర్మ, ఫణి శర్మ, చెరుకూరి కారుణ్య శర్మ, కార్తీక్‌శర్మ స్వామివారికి మహాగణపతి పూజ, మహన్యాస పారాయణ, 11 రుద్రాలు, 21 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నేరేడు పండ్లు, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి నీరాజన సప్త హారతులు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో బాల వికాస కేంద్రాలు

కరప: ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో ఈ గురుపౌర్ణమి (ఆషాఢమాసం పౌర్ణమి) నుంచి బాలవికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు తెలిపారు. మండలం నడకుదురులో గురువారం జరిగిన మండల సమరసత సేవా ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల వికాస కేంద్రాలు నిర్వహించేందుకు సింహాచలంలో ఈ నెల ఐదో తేదీ నుంచి 7వ తేదీ వరకు మాతాజీలకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ప్రత్తిపాడులో ఈ నెల 8వ తేదీన కాకినాడ జిల్లా మహిళా సమావేశం ఏర్పాటు చేశామని, సమావేశానికి ప్రతి మండలం నుంచి సమరసత సేవా ఫౌండేషన్ మహిళా కన్వీనర్లు, సహ కన్వీనర్లు పాల్గొనాలని ఆయన కోరారు. గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ ధార్మిక జట్ల ఆధారంగా వారం వారం భజనలు, సత్సంగాలు, నగర సంకీర్తనలు, పౌర్ణమి హారతులు జరుగుతాయన్నారు. ముందుగా అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఖండ కన్వీనర్ ముమ్మిడి శ్యామ్‌సుందరరావు, మండల కన్వీనర్ ముమ్మిడి పెద్దకాపు, కాలకురస వెంకటరమణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉండాలి



మాధవపట్నంలో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: మధ్యాహ్న భోజనం నాణ్యతతో రుచిగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. గురువారం మండల పరిధిలో మాధవపట్నం జమునానగర్, వీకే రాయపురంలోని సత్యవరపుపేట ఎలిమెంటరీ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. బోజనానికి సంబంధించిన వంట పాత్రలు, భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు బోజనాలు వడ్డించి అభిప్రాయాలు సేకరించారు. ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తయిన పాఠ్యాంశాలకు సంబంధించిన వాటిపై విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల హాజరు 100 శాతం ఉండాలన్నారు. బడి బయట పిల్లలు లేకుండా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి



వీకే రాయపురంలో రంగా విగ్రహానికి నివాళులు అర్పించిన అభిమానులు



కొత్తపల్లిలో వంగవీటి మోహనరంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

కొత్తపల్లి: కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతిని మండల వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఊరచెరువు సెంటర్‌లోని వంగవీటి రంగా విగ్రహానికి గవర రాంబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్ల శ్రీధర్ మాట్లాడుతూ దివంగత నేత వంగవీటి మోహనరంగా ఒక కులం కోసం పోరాడిన వ్యక్తి కాదన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడిన వంగవీటి రంగాను ఇంకా పలువురు కాపు సామాజిక వర్గానికి చెందిన నేతగానే గుర్తిస్తున్నారన్నారు. పేదల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను కొనిడారు. కార్యక్రమంలో గవర నాగేశ్వరరావు, చింతలపూడి వెకటరమణ, గంధం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వీకే రాయపురం, పి.వేమవరాల్లో..

సామర్లకోట: కాపు ఉద్యమ నేత వంగవీటి మోహన రంగాకు గురువారం ఘనంగా నివాళ్లు అర్పించారు. మండల పరిధిలో వీకే రాయపురం, పి.వేమవరం గ్రామాల్లో ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలల్లో ఉపసర్పంచ్ చల్లా శ్రీనివాసు, గొల్లపల్లి సర్వేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మాజీ ఎంపీటీసీ వెలమర్తి బుల్లిరాజు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

బుజ్జిగాడికి భలే ఫాలోయింగ్



కాకినాడ ఎస్ఆర్ఎంటీ మాల్ వద్ద కల్కి చిత్రంలోని బుజ్జి వాహనాన్ని చూస్తున్న సందర్శకులు

కాకినాడ రూరల్: ప్రభాస్ హీరోగా నటించిన కల్కి చిత్రంలో సందడి చేసిన బుజ్జి వాహనం కాకినాడలో గురువారం సందడి చేసింది. సర్పవరం జంక్షన్ వద్ద ఐనాక్స్‌లో కల్కి చిత్రం ప్రదర్శిస్తుండడంతో ఎస్ఆర్ఎంటీ మాల్ వద్ద ప్రజల సందర్శనార్థం ఉదయం నుంచి సాయంత్రం వరకు బుజ్జిని అందుబాటులో ఉంచారు. దానిని చూసేందుకు యువతతో పాటు జనాలు భారీగా తరలివచ్చి సెల్ఫీలు దిగారు.

లక్ష్యాలు పూర్తిచేయాలి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): నిర్దేశించిన లక్ష్యాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. కాకినాడలోని గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో గురువారం ఆశాఖ ఈఈలు, డీఈ, ఏఈలతో సమీక్షించారు. జిల్లాలో 1.2 లక్షల ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటిలో త్వరగా పూర్తి చేసేందుకు వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నట్లు చెప్పారు. మొదటి వంద రోజుల్లో 7200 గృహాలు పూర్తి కావాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులతో మమేకమై గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు.